

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### సమ్మెకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, సీఐటీయు మద్దతు

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్ష మంగళవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీరికి ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ సీఐటీయూ సంఘాలు మద్దతు ప్రకటించారు. అనంతరం దీక్షా చేస్తున్న ఉద్యోగులను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా సుమారు 20వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ వారిని రెగ్యులరైజ్ చేయకపోవడం, మేనిఫెస్టోలో వారిని రెగ్యులర్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వారికి వేతనం పెంచాలన్నారు. జిల్లాస్థాయిలో ఏపీవో సిస్టం అనలిస్టు, టెక్నికల్ పర్సనల్ ఆపరేటర్లు, డీఎంఎంటీ మెసెంజర్లు, మండల స్థాయిలో ఎమ్మెల్యే కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్పీలుగా పాఠశాల స్థాయిలో ఎన్నో ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేస్తున్న వారందరికీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. అలాలగే వారికి ఆరోగ్య కార్డులతో పాటు మహిళలకు ప్రసూతి సెలవులు, జీవిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని కోరారు. లేదంటే వారికి అండగా విద్యార్థి యువజన సామాజిక ప్రజా సంఘాలు నిలిచి పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఇప్పపూల దేవయ్య, కత్తి జయలక్ష్మి, రాజు, తుమ్మ దేవేందర్, భవాని , నీరజ, సలీం, నరేందర్, శ్రీనివాస్, రవి ,నరేశ్, దేవరాజు, చందన్ , శ్రీలత, లావణ్య , పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్లలో పోలీస్ అక్క

### మహిళల రక్షణే ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ మరో ముందడుగు
### షీ టీమ్ ఆధ్వర్యంలో ప్రతి పీఎస్ పరిధిలో ఓ మహిళా కానిస్టేబుల్ ఎంపిక

**ప్రజానావ, సిరిసిల్ల:** మహిళల రక్షణే ధ్యేయంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'పోలీస్ అక్క' పేరుతో జిల్లావ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళా కానిస్టేబుల్‌ను ఎంపిక చేసింది. వీరంతా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో షీటీమ్స్‌తో పనిచేస్తూ విద్యార్థినులు, మహిళలకు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక కల్యాణ మండపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మహిళా రక్షణకు ప్రథమ బాధ్యతగా తీసుకుంటూ మహిళ రక్షణయే ధ్యేయంగా జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే 'పోలీస్ అక్క' పేరుతో జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళా కానిస్టేబుల్ ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పోలీస్ అక్కగా ఎన్నికైన వారంతా షీ టీమ్ కి సహాయకంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు పోక్సో యాక్ట్, సెక్సువల్ హర్స్మెంట్, ఈవ్ టీసింగ్,గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సమస్యలు ఎదురైనప్పుడు బాధితులకు అండగా ఉంటారన్నారు. ఇందులో భాగంగా షీ టీమ్, డయల్ 100, పోలీస్ అక్క నంబర్లు ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థినులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాలో వేదికగా వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీటీమ్ నెంబర్ 8712656425 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన షీ టీమ్ విద్యార్థులు, మహిళల సమస్యలపై వెంటనే స్పందిస్తుందన్నారు. ఈ ఏడాది 52మంది ఆకతాయిలను రెండ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాదిలో మహిళలు, విద్యార్థులను వేధిస్తున్న 60 మందిపై పెట్టి కేసులు, 44 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ కృష్ణ, ట్రెయినీ ఎస్ఐ వీనిత, షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, షీ టీమ్ సిబ్బంది, పోలీస్ అక్కగా ఎన్నిక కాబడిన మహిళ కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పోలీస్ అక్కగా ఎంపికైంది వీరే..

సిరిసిల్ల టౌన్ కే.సరస్వతి, తంగళ్లపల్లి ఎస్. సుజాత, ముస్తాబాద్ జే.మంజూల, ఇల్లంతకుంట ఎం.ప్రవళిక, ఎల్లారెడ్డిపేట బీ.రోజా, గంభీరావుపేట బీ.శిరీష, వీర్నపల్లి కే.స్వప్న, వేములవాడ టౌన్ లత, వేములవాడ రూరల్ ఎన్.రేణుక, బోయిన్‌పల్లి పింకల్ ఎ.యాదవ్, చందుర్తి హెచ్. శ్రీవెన్నెల, కోనరావుపేట్ సంధ్య, రుద్రంగి జీ.అమల

# దళిత, గిరిజన రైతుల అణచివేత

- రైతులపై కాంగ్రెస్‌అక్రమ కేసులు
- బీఆర్ఎస్‌రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్
- అంబేద్కర్ విగ్రహానికి వినతి



**ప్రజానావ, కాగజ్ నగర్ టౌన్ :** లగచర్లలో రైతుల అక్రమ అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం కాగజ్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ద్వారా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, దళిత గిరిజన రైతుల పట్ల అణిచివేత చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా, కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో రైతన్నల పేద భూములను బలవంతంగా లాక్కొనే కుట్ర జరుగుతోంది. ప్రభుత్వానికి రైతుల జీవనాధారాన్ని లాక్కోకుండా, మాయమాటలు చెప్పి వారి భూములను హరిస్తు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రైతన్నలపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. రైతన్నలు తమ జీవనాధారాన్ని కాపాడాలని పది నెలలుగా విజ్ఞప్తి చేసినప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతన్నలపై నమోదైన అక్రమ కేసులను తొలగించి, వెంటనే విడుదల చేయాలని, వారి కుటుంబాలను వేధించడం ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సద్బుద్ధిని ప్రసాదించాలని, రైతుల హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ లేండుగురే శ్యాంరావు, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, మండల కన్వీనర్లు, యూత్ కన్వీనర్, మహిళా నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, ఆర్ఎస్పీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ వినతి

**ప్రజానావ, ఖానాపూర్(ఉట్నూర్ ):** లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులకు వ్యతిరేకంగా మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో శ్రేణులు క్యాంప్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తుందని, అన్నింటికంటే ముఖ్యంగా దళిత గిరిజనులు ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యల వల్ల తీవ్ర అణచివేతకు గురవుతున్నారని, పేద గిరిజన దళిత రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని, వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తుందని, ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కార్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి బుద్ధి రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఉట్నూర్‌పట్టణంలో..

**ప్రజానావ, ఉట్నూర్:** భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని అంబే ద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని బీఆర్ఎస్ నాయకులు వినతి అందజే శారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల అధ్యక్షుడు పంద్ర జైవంత్, రావు, భరత్ చౌహాన్, కొమ్ము విజ య్, సలిమోద్దీన్, ధరణి రాజేష్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజానావ, సనత్‌నగర్:** పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సనత్ నగర్ (ఎర్రగడ్డ) వద్ద నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ పనులను పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజాప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వచ్చే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఆస్పత్రిని ప్రారంభిస్తామని చెప్పారు. విదేశాల్లో అందించినట్లుగానే రాష్ట్రంలోనూ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తామన్నారు. టిమ్స్ హాస్పిటల్ నిర్మాణంలో ఆర్అండ్‌బీ, వైద్యశాఖ సమన్వయం చేసుకునేలా నోడల్ ఆఫీసర్ ను నియమిస్తామని తెలిపారు. ఎక్కడా లోపాలు జరగకుండా నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. బ్లాక్-ఏ ఇప్పటికే స్లాబ్ వర్క్ పూర్తయ్యిందని టైలింగ్, సీలింగ్, ప్లాస్టరింగ్ పనులు నడుస్తుండగా, బ్లాక్ %-% బీ 5వ అంతస్తు స్లాబ్ పడితే పూర్తవుతుంది. బ్లాక్ %-% సీ పనులు చివరి దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పేషేంట్ల అటెండెంట్లు ఉండేందుకు అధునాతన సౌకర్యాలతో ధర్మశాల, అక్షయపాత్ర సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఐదు రూపాయలకే నాణ్యమైన భోజన వసతి కల్పిస్తామన్నారు. అధునాతన హాస్టల్ బిల్డింగ్ నిర్మాణంలో ఉంది, ఫార్మసీ రూం, ఓపీడీ రిజిస్ట్రేషన్ రూంలను కంప్యూటీకరించి వేగంగా అపాయింట్‌మెంట్లు దొరికేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



